# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 10 సంచిక : 35 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | శుక్రవారం 9 అక్టోబర్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :35 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | FRI 9 OCTOBER 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# ఏపీకి పెట్టుబడుల వెల్లువ..

## రూ.22.6 లక్షల కోట్లు సమీకరించాం

- నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు
- గ్లోబల్ ఇన్వెస్టర్లను సదస్సుకు హాజరు కావాలని ఆహ్వానించిన సీఎం చంద్రబాబు
- జూన్ 2024 నుంచి రూ. 22.6 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయన్న సీఎం
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు మారుతున్నామన్న చంద్రబాబు
- రాష్ట్రంలో 7.1 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి



**ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' దశకు ఏపీ మారుతోందని, ప్రపంచ పెట్టుబడిదారులకు ఇదే సరైన సమయమని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని ఆయన గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆహ్వానించారు.**

పెన్ పవర్ డెస్క్:గురువారం ఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి చంద్రబాబు ఈ సదస్సు కర్టెన్ రైజర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 2024 నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి రూ. 22.6 లక్షల కోట్ల విలువైన 714 ప్రాజెక్టుల రూపంలో పెట్టుబడులు వచ్చాయని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలోని యువతకు 7.1 లక్షల ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని ఆయన తెలిపారు. సాంకేతికత ఆధారిత పాలనతో వ్యాపార అనుమతులు, ప్రక్రియలను వేగవంతం చేస్తున్నామని స్పష్టం చేశారు.
రాష్ట్రంలో ప్రతి రంగంలోనూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని చంద్రబాబు వివరించారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్, అమరావతిలో క్వాంటం వ్యాలీ, గ్రీన్ హైడ్రోజన్ ఎకోసిస్టమ్స్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో ఏపీని ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్నామని అన్నారు."వేగం, విస్తరణ, స్థిరత్వం చోదకాలుగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌తో భాగస్వాములు కండి. రాష్ట్ర ప్రగతిలో పాలుపంచుకోండి" అని ప్రపంచ వ్యాపార నాయకులను, పెట్టుబడిదారులను చంద్రబాబు కోరారు. విశాఖ సదస్సు ఏపీ అభివృద్ధి ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**చంద్రబాబు పూర్తి ప్రసంగం ఇదిగో..**

వేదికను అలంకరించిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రివర్యులు శ్రీ పియూష్ గోయల్ గారికి, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (జ××) ప్రతినిధులకు, దేశ విదేశాల నుంచి విచ్చేసిన పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడిదారులకు, మిత్రులకు, మీడియా ప్రతినిధులకు అందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు.

- మిగతా 2లో



## ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ..

## రాష్ట్రాభివృద్ధిపై కీలక వినతులు

- పధాని నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ
- గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై కీలక ప్రతిపాదన
- 2027 గోదావరి పుష్కరాలకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి
- రాష్ట్రంలో వర్షాభావం, వ్యవసాయ సంక్షోభంపై ప్రధానికి వివరణ
- విశాఖ మెట్రో, అమరావతి ఓఆర్ఆర్‌కు సహకారం కోరిన సీఎం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులు, అభివృద్ధి అంశాలపై ప్రధానితో చర్చించారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో దక్షిణాది రాష్ట్రాల నీటి కష్టాలు తీరతాయని,

- మిగతా 2లో



సీఈసీ, కమిషనర్ల నియామకాలు

## రద్దు చేయాలి..

## సుప్రీంకోర్టులో పిటిషన్

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్
- ఇద్దరు కమిషనర్ల నియామకం, 2023 చట్టంపైనా పిటిషన్‌లో అభ్యంతరం
- సెలక్షన్ కమిటీ నుంచి సీజేఐని తొలగించడాన్ని ప్రశ్నించిన పిటిషనర్
- సీఈసీ రాజీనామా కోరుతూ దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలు

- మిగతా 2లో



## ఉక్రెయిన్‌పై రష్యా రాకెట్ దాడి..

## బస్టాప్‌లో 33 మంది పౌరుల మృతి

- ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి
- తూర్పు ఉక్రెయిన్‌లోని క్రమటోస్క్ బస్టాప్‌పై బాంబుల వర్షం
- ఘటనలో 33 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయిన వైనం
- ఈ ఏడాదిలో ఇదే అతి పెద్ద సింగిల్ అటాక్
- ప్రతీకారం తీర్చుకుంటామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హెచ్చరిక

- మిగతా 2లో

## బీసీలే మా వెన్నెముక.. వారి రిజర్వేషన్లలో రాజీ లేదు

- బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామన్న లోకేశ్
- నేడు సుప్రీంకోర్టు నుంచి కీలక తీర్పును ఆశిస్తున్నామని వ్యాఖ్య
- స్థానిక ఎన్నికల తర్వాతే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకే తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ మంత్రి నారా లోకేశ్ మరోసారి స్పష్టం చేశారు. ఈ అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, న్యాయస్థానం నుంచి తీర్పు

- మిగతా 2లో

## ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలను చంద్రబాబు కొనసాగిస్తున్నారు

- పర్చూరు నియోజకవర్గంలో పర్యటించిన అనిత
- పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న హోంమంత్రి
- గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించడం శుభపరిణామమని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలో ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ఈరోజు పర్యటించారు. పర్యటనలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే

- మిగతా 2లో




క్యాన్సర్ మందుల ధరలకు

## కేంద్రం కళ్లెం..

### 70 శాతం వరకు తగ్గే ఛాన్స్

పెన్ పవర్ డెస్క్:క్యాన్సర్ చికిత్స తీసుకుంటున్న వారి కోసం కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ధరల నియంత్రణ పరిధిలో లేని అన్ని

- మిగతా 2లో

# ఈనెల 16న విశాఖలో వైసీపీ 'ఉత్తరాంధ్ర బీసీ గర్జన'

- బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వ విధానాలను ఎండగట్టడమే లక్ష్యమన్న వైసీపీ
- బీసీలను చంద్రబాబు మోసం చేస్తున్నారని ఆరోపణ
- ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళతామని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:ఉత్తరాంధ్రలోని బీసీ వర్గాల గొంతుకను బలంగా వినిపించేందుకు వైసీపీ సిద్ధమైంది. ఇందులో భాగంగా ఈ నెల 16వ తేదీన విశాఖపట్నంలో 'ఉత్తరాంధ్ర బీసీ గర్జన' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ సభకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పార్టీకి చెందిన

- మిగతా 2లో



## సాహిత్యంలో నోబెల్ ప్రైజ్

### కెనడా రచయిత్రి అన్నే కార్సన్‌కు విశిష్ట పురస్కారం

- 2026 సాహిత్య నోబెల్ పురస్కారం కెనడా రచయిత్రి అన్నే కార్సన్‌కు ప్రకటన
- సరికొత్త సాహిత్య ప్రక్రియలను సృష్టించినందుకు ఈ గౌరవం
- సంప్రదాయ శైలికి ఆధునికతను జోడించడంలో ఆమెది ప్రత్యేక పంథా
- కవిత్వం, అనువాదం, శాస్త్రీయ పాండిత్యాన్ని మిళితం చేసిన రచయిత్రి
- డిసెంబర్ 10న 12 మిలియన్ల స్వీడిష్ క్రోనార్ల బహుమతి ప్రదానం

- మిగతా 2లో



## ప్రముఖ నటుడు నానా పటేకర్ కన్నుమూత

పెన్ పవర్ డెస్క్: ప్రముఖ సినీ నటుడు నానా పటేకర్ (75) గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు గోవాలోని తన నివాసంలో అపస్మారక స్థితిలో

- మిగతా 2లో




## అది ఫేక్ ఫొటో.. నమ్మొద్దు

పెన్ పవర్ డెస్క్: సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది ఫేక్ ఫొటో అని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఎన్టీఆర్ అభిమానులు కొందరు తన ఫొటోను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంటూ సినీనటుడు ఎన్టీఆర్‌కు చెందిన

- మిగతా 2లో

# అక్షరాంధ్రతో వయోజనులకు మేలు-ఎంపీడీవో రాజు.




**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 08:** అక్షరాంధ్ర కార్యక్రమంతో వయోజనలకు మేలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీడీవో ఏ.రాజు అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వయోజనులకు విద్యకు ఉపకరించే పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఏపిఎం సీతారావమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా గురువారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు సాయంత్రం 6 గంటలకు 9 గంటల వరకు జరిగే ఈ వయోజన విద్య ద్వారా నిరక్షరాస్యలకు మేలు జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ వయోజన విద్యను వినియోగించుకోవాలని ఆయన కోరారు. అలాగే ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ పుస్తకాల ద్వారా విద్య నభ్యసించి అక్షరాస్యులుగా మారతారని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం ఎస్.సీతారావమ్మ, సీసీలు వి.ఎన్.సత్తిబాబు, కె.ఎల్.వి.ప్రసాద్, అకౌంటెంట్ కుమార్, ఎఫ్ పి అకౌంటెంట్ మల్లీశ్వరి, వివోఏలు, వివోబిలు, తదితరులు పాల్గొన్నారు.

# పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా




# పల్లె పండుగ 3.0తో గ్రామీణాభివృద్ధికి కొత్త ఊపు

**రామచంద్రపురం రూరల్ మండలంలో రూ.2.84 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**



**రామచంద్రపురం, పెన్ పవర్, అక్టోబర్ 8:** పల్లె పండుగ 3.0 కార్యక్రమంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి కొత్త ఊపు వచ్చిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువారం రామచంద్రపురం రూరల్ మండలంలో మంత్రి సుడిగాలి పర్యటన నిర్వహించి పలు గ్రామాల్లో రూ.2.84 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. భీమక్రోసుపాలెంలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.69.30 లక్షల వ్యయంతో నిర్మించిన 60 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు.పల్లె పండుగ 3.0లో భాగంగా నరసాపురపుపేటలో రూ.19.20 లక్షలు, యనమదలలో రూ.8 లక్షలు, తాడిపల్లిలో రూ.24 లక్షలు, కాపవరంలో రూ.14.50 లక్షలు, హసనబాదలో రూ.24.50 లక్షలు, భీమక్రోసుపాలెంలో రూ.14 లక్షలు, తోటపేటలో రూ.10 లక్షలు, అన్నయ్యపేటలో రూ.10 లక్షలు, వెంకటాయపాలెంలో రూ.17 లక్షలు, వేగాయమ్మపేటలో రూ.10 లక్షలు, తాళ్లపొలంలో రూ.11.50 లక్షలు, ఉట్రుమిల్లిలో రూ.16.50 లక్షలతో వివిధ మౌలిక వసతుల పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పల్లె పండుగ 3.0 ద్వారా రూ.11,085 కోట్లతో గ్రామీణాభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రహదారులు, కాలువలు, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ ప్రాంతాలకు మళ్లీ అభివృద్ధి వెలుగులు తీసుకురావడమే కూటమి ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు.గత మూడు రోజుల్లోనే రామచంద్రపురం పట్టణంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ నిధులతో రూ.17 కోట్ల అభివృద్ధి పనులకు, కె.గంగవరం మండలంలో రూ.1.37 కోట్ల పనులకు శంకుస్థాపనలు నిర్వహించామని మంత్రి తెలిపారు. తాజాగా రామచంద్రపురం రూరల్ మండలంలో రూ.2.84 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేపట్టినట్లు చెప్పారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని స్పష్టం చేశారు.

గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

సీఎం చంద్రబాబు దూరదృష్టితో అభివృద్ధి: వాసంశెట్టి సత్యం

కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నారని పేర్కొన్నారు. పల్లె పండుగ 3.0 ద్వారా గ్రామాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తోందన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక చొరవతో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని సత్యం తెలిపారు. తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి రామచంద్రపురం నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ సాంబశివరావు, రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు,ఎంపీడీవో పద్మజ్యోతి, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్,ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామారావు,కూటమి పార్టీ నాయకులు, అధికారులు,గ్రామ పెద్దలు, మహిళలు, యువత, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వంపై తీసుకోవాలి.





**-నిందితులను కఠినంగా శిక్షించాలి**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, అక్టోబర్,08:** జర్నలిస్టులకు రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీరామ్ జీ, జగ్గంపేట నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాఠంశెట్టి సూర్యచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రజాశక్తి విలేఖరి సిగిరెడ్డి రమేష్ పై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు రమేష్ ని పలువురు ప్రముఖ నేతలు,ప్రజా సంఘాలు నాయకులు పరామర్శించారు. సమాజంలో అవినీతి అక్రమాలు ప్రజా సమస్యలు రాసే పత్రిక ప్రజాశక్తిని అటువంటి పత్రికలో వాస్తవాలు రాసిన రమేష్ పై దుండగులు పట్టపగలే దౌర్జన్యంగా దాడి చేసి హత్య ప్రయత్నం చేయడానికి ప్రయత్నం చేయడం దారుణమని బీసీ ఐక్య సంఘర్షణ సమితి కన్వీనర్ ఏపూరి శ్రీను అన్నారు. వైసీపీ నేతలు బదిరెడ్డి గోవింద్, సుంకర రాంబాబు పరామర్శించారు. నిజాయితీగా వాస్తవాలను వెలికి తీసి వార్తల్ని రాస్తే ఇటువంటి దాడులు చేస్తారని తక్షణమే నిందితుల్ని అరెస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దలే చిట్టిబాబు, దాడి రాజగోపాల్, పాముల చంటి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

# వీఆర్ఏల నిరసనకు మాజీ సర్పంచ్ కాల సాయిబాబా సంఘీభావం




**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 08:** ఆలమూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న ధర్నా చౌక్లో గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఎ) సంఘం చేపట్టిన నిరవధిక సహాయ నిరాకరణ ఉద్యమం గురువారానికి 23 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సూర్యారావుపేట మాజీ సర్పంచ్ కాల సాయి బాబా నిరసన శిబిరాన్ని సందర్శించి వీఆర్ఎలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ గ్రామాల్లో వీఆర్ఎలు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వీఆర్ఎల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. మండల వీఆర్ఎల సంఘం అధ్యక్షులు తాతపూడి ఇస్సాక్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పే స్కేల్ను వీఆర్ఎలకు కూడా అమలు చేయాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని, విధి నిర్వహణలో మరణించిన వీఆర్ఏల కుటుంబాల్లో ఒకరికి కారుణ్య నియామకం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఎల సంఘం సెక్రటరీ కె. శివరామారావు,ఉపాధ్యక్షులు భువనగిరి ఏసు, సలహాదారు నాగేశ్వరరావు, ట్రెజరర్ కుందేటి శ్రీను, సభ్యులు యార్లగడ్డ జీవరత్నం, ఏడిది వెంకటాద్రి, బూరిగ మంగాలక్ష్మి, చోడవరపు రామలక్ష్మి, కోట లక్ష్మి, షేక్ బషీర్ బీబీ తదితరులు పాల్గొన్నారు.

# 31వ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు ముందస్తు సన్నాహకంగా ప్రాంతీయ సమావేశం







- పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టాలి
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- అధికారులకు కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశం

**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 8:** 31వ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు ముందస్తు సన్నాహకంగా ఈ నెల 12న జేఎన్‌టీయూ కాకినాడలో నిర్వహించనున్న ప్రాంతీయ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రాంతీయ సమావేశం నిర్వహణపై జిల్లా స్థాయి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. వివిధ శాఖల అధికారులకు విధులు, బాధ్యతలను కేటాయించి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో భారత పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రాంతీయ సమావేశం ద్వారా పారిశ్రామిక అభివృద్ధిని నగరాలకే పరిమితం చేయకుండా, వివిధ ప్రాంతాల్లో లభించే ముడి వనరులు, స్థానిక ప్రత్యేకతలకు అనుగుణంగా పెట్టుబడులను ఆకర్షించి పరిశ్రమలను ప్రోత్సహించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటి అభివృద్ధికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అనుసంధానం, రుణ సదుపాయాలపై అవగాహన కల్పించేందుకు సమావేశం దోహదపడుతుందన్నారు."ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త" అనే ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా నూతన స్టార్టప్‌లు, యువ పారిశ్రామికవేత్తలను పెట్టుబడిదారులతో అనుసంధానించేందుకు ఈ సమావేశం వేదికగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు.

సమావేశానికి హాజరయ్యే ముఖ్య అతిథులు, పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. వీఐపీ ప్రోటోకాల్, అతిథి గృహాల కేటాయింపు, ఏపీ పెవిలియన్, ఎగ్జిబిషన్ స్టాల్స్, వేదిక, బ్యాక్‌డ్రాప్, వాహనాల పార్కింగ్, బందోబస్తు, బారికేడింగ్, అల్పాహారం, భోజన ఏర్పాట్లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల రిజిస్ట్రేషన్ తదితర ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య బృందంతో పాటు అంబులెన్స్ సౌకర్యంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, ఏపీఈపీడీసీఎల్ అధికారులు సమావేశం పూర్తయ్యే వరకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆహార కల్తీ నియంత్రణ అధికారులు ఆహార పదార్థాల నాణ్యతపై తనిఖీలు నిర్వహించాలని సూచించారు. జడ్పీ సీఈవో ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ, ఎగ్జిబిషన్‌కు సంబంధించిన స్టాల్స్ ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు.డీఆర్డీఏ, డ్వామా అధికారులు భారత పరిశ్రమల సమాఖ్య ప్రతినిధులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య అతిథులకు లైజన్ అధికారులుగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. సమావేశానికి సంబంధించిన మీడియా, ప్రెస్ కవరేజ్ ఏర్పాట్లను సమాచార పౌర సంబంధాల శాఖ పకడ్బందీగా చేపట్టాలని, ఫ్లెక్సీలు, ప్రింటింగ్ మెటీరియల్, బ్యానర్లు, సైనేజ్ బోర్డులు తదితర ప్రచార సామగ్రిని సకాలంలో సిద్ధం చేయాలని ఆదేశించారు.

**ఏర్పాట్లను పర్యవేక్షించనున్న జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**

వేదిక ఏర్పాట్లను కాకినాడ ఆర్డీఓ ఎస్. మల్లిబాబు పర్యవేక్షించాలని, మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్యం, తాగునీటి వసతులను కల్పించాలని కలెక్టర్ సూచించారు. మధ్యాహ్న భోజన ఏర్పాట్లను డీఎస్ఓ, డీఎం సివిల్ సప్లై అధికారులు సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. ప్రాంతీయ సమావేశ ఏర్పాట్లను ఓవరాల్‌గా జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు.

సమన్వయ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పే నాయక్, జడ్పీ సీఈవో వి.వి.వి.ఎస్. లక్ష్మణరావు, డీఐసీ జనరల్ మేనేజర్ సీహెచ్. గణపతి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఏ. రమణారెడ్డి, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎన్. శ్రీధర్, డ్వామా పథక సంచాలకులు ఎస్. మధుసూదన్, ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ ఎస్. చలమయ్య తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట.. రూ.50 వేల విలువైన బియ్యం స్వాధీనం






**రావులపాలెం పెన్ పవర్ అక్టోబర్ 8:** పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని రావులపాలెం పోలీసులు పట్టుకున్నారు. బుధవారం రాత్రి రావులపాలెం జూనియర్ కళాశాల ఎదురుగా జాతీయ రహదారిపై పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన వెలుగుచూసింది. రావులపాలెం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. రమేష్‌బాబుకు అందిన సమాచారంతో ఎస్సై చంటి సిబ్బందితో కలిసి జాతీయ రహదారిపై తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గోపాలపురం వైపు నుంచి రావులపాలెం వైపు వస్తున్నఞా 39 ఔఖీ 5162 నంబరు గల వ్యాన్‌ను అనుమానంతో ఆపి తనిఖీ చేశారు.వ్యాన్‌లో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యం బస్తాలు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మొత్తం 50 కిలోల చొప్పున 50 బస్తాలు, అంటే సుమారు 2,500 కిలోల బియ్యం ఉన్నట్లు నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు రూ.50 వేలుగా పోలీసులు అంచనా వేశారు.బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రేషన్ బియ్యం అక్రమ తరలింపునకు సంబంధించి వ్యాన్ డ్రైవర్‌పై ఎస్సై చంటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పేదల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా పోలీసులు చేపడుతున్న తనిఖీల్లో భాగంగా ఈ పట్టుబడటం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ప్రతి మహిళా వ్యాపారవేత్తగా ఎదగడమే కాకుండా,ఆర్థికాభివృద్ధి సాధించాలి.

- డి.ఆర్.డి.ఎ ప్రాజెక్టు డైరెక్టర్,జి శ్రీనివాసరావు,





**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్, 8:** ప్రతి మహిళ వ్యాపారవేత్తగా ఎదగడమే కాకుండా,ఆర్థికాభివృద్ధి సాధించాలని డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, జి శ్రీనివాసరావు అన్నారు.గురువారం సర్క్యులేటరీ ఆక్వా సిస్టం ఎండి ఉదయ్ కిషన్ తో కలిసి ప్రత్తిపాడు మండలం లంపకలోవ గ్రామంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ ప్రెన్యూర్ కార్యక్రమంలో భాగంగా కొర్రమేను పెంపకం పై అవగాహన కల్పించి, వారి సందేహాలను నివృత్తి చేసారు.కొంత మంది మహిళా రైతులు కొర్రమేను చేపల పెంపకానికి ముందుకు వచ్చారు. అనంతరం లంపకలోవ గ్రామంలో గంప దేవి నిర్వహిస్తున్న జీడీపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ ను,ఉత్తరకంచి గ్రామంలో చెల్లపరెడ్డి వెంకటలక్ష్మి నిర్వహిస్తున్న నాటు కోళ్ల పెంపకం యూనిట్ ను సందర్శించారు.ఈ కార్యక్రమంలో మండల ఏపిఎం,వై వెంకట్,మండల సమాఖ్య అధ్యక్షురాలు సిహెచ్ లోవకుమారి, సిసి,ప్రసాద్ వి ఓ ఏ లు దుర్గ, స్వర్ణలత, పలువురు మహిళా సంఘాల సభ్యులు హాజరయ్యారు.

# అనుమతి ఎక్కడ... కనెక్షన్ ఎలా?

- సూరంపాలెం నిర్మాణాల వెనుక 'ఫైళ్ల కథ' తేలాలంటే రికార్డులు తెరవాల్సిందే!
- 'పెన్ పవర్' ప్రత్యేక పరిశోధన --- ఎపిసోడ్--2
- పంచాయతీ అనుమతి లేకుంటే భవనం ఎలా నిర్మించారు?
- విద్యుత్ మీటర్లకు సమర్పించిన పత్రాలేమిటి?
- వాటర్ కనెక్షన్లకు ఆధారం ఏమిటి?
- చీూజ లేకుండా కమర్షియల్ వినియోగం సాధ్యమా?
- ఖఖణాూ పర్యవేక్షణలో ఈ నిర్మాణాలు ఉన్నాయా?
- సూరంపాలెం పంచాయితీ పరిధిలో రామేశ్వరంపేట భూ వివాదంలో భూమి యాజమాన్యం ఎంత కీలకమో, నిర్మాణాలకు ఇచ్చిన అనుమతుల వ్యవహారం కూడా అంతే కీలకంగా మారుతోంది.
- స్థానికుల కథనం ప్రకారం వివాదాస్పద ప్రాంతంలో కొన్ని భారీ భవనాలు ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకోవడం లేదా వినియోగంలోకి రావడం జరిగిందని తెలుస్తోంది.

**అక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది.**

**పంచాయతీ అనుమతి ఉందా?**

గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మాణం చేపట్టాలంటే సంబంధిత నిబంధనల ప్రకారం భవన అనుమతి, ప్లాన్ ఆమోదం వంటి అంశాలు వర్తించవచ్చు.

**మరి ఈ భవనాలకు---**

బిల్డింగ్ ప్లాన్ ఎవరు ఆమోదించారు?
ఎప్పుడు దరఖాస్తు చేశారు?
ఏ పేరుతో అనుమతి తీసుకున్నారు?
ఆ భూమికి సంబంధించిన టైటిల్ డాక్యుమెంట్లు ఏమి సమర్పించారు?

**అనే విషయాలు పంచాయతీ రికార్డుల్లో స్పష్టంగా ఉండాలి.**

ఒకవేళ అనుమతి లేకుండా నిర్మాణం జరిగితే, పనులు మొదలైన దశలోనే అధికారులు ఎందుకు అడ్డుకోలేకపోయారు? అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది.

**'నోటీసు ఇచ్చాం'తో బాధ్యత పూర్తవుతుందా?**

అక్రమ నిర్మాణాల విషయంలో అధికారులు తరచూ "నోటీసులు జారీ చేశాం" అని చెబుతుంటారు.

**కానీ నోటీసు తర్వాత ఏమైంది?**

నిర్మాణాన్ని నిలిపివేశారా?
సీజ్ చేశారా?
కూల్చివేతకు ఆదేశించారా?
ఉన్నతాధికారులకు నివేదిక పంపారా?
నోటీసు ఇచ్చిన తర్వాత కూడా నిర్మాణం కొనసాగితే, అది అమలు వ్యవస్థ వైఫల్యమా? లేక ఇతర కారణాలున్నాయా? అన్నది కూడా విచారణలో తేలాల్సిన అంశం.

**కరెంట్ మీటర్ ఎలా?**

నిర్మాణానికి సంబంధించిన చట్టబద్ధతపై వివాదం ఉన్నప్పుడు, అక్కడ విద్యుత్ కనెక్షన్ ఏ ఆధారంతో మంజూరైంది అనేది కీలకం.

**విద్యుత్ శాఖకు సమర్పించిన---**

యాజమాన్య పత్రాలు, చిరునామా ఆధారాలు, అనుమతి పత్రాలు, అప్లికేషన్ వివరాలు
బయటకు వస్తే చాలా సందేహాలకు సమాధానం లభించే అవకాశం ఉంది.

**వాటర్ కనెక్షన్ వెనుక ఏ పత్రాలు?**

భవనానికి నీటి కనెక్షన్ ఉంటే, సంబంధిత సంస్థ వద్ద కూడా దరఖాస్తు, యాజమాన్య లేదా వినియోగ ఆధారాలు ఉండే అవకాశం ఉంటుంది.
ఆ పత్రాలను పరిశీలిస్తే భవనం ఏ హోదాలో నమోదు అయిందో తెలుస్తుంది.

**ఖఖణాూ ఏం చెబుతోంది?**

సూరంపాలెం ప్రాంతంలో పట్టణాభివృద్ధి నిబంధనలు వర్తించే పరిధి ఉంటే, సంబంధిత అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పాత్ర కూడా పరిశీలించాల్సి ఉంటుంది.కమర్షియల్ నిర్మాణాలకు అవసరమైన చీూజలు, లేఅవుట్ నిబంధనలు, భవన వినియోగ అనుమతులు పాటించారా? అనే అంశంపై అధికారిక స్పష్టత అవసరం.

**అందువల్ల ఈ వ్యవహారంలో ఊహాగానాలకన్నా---**

పంచాయతీ ఫైలు, రెవెన్యూ రికార్డు, విద్యుత్ కనెక్షన్ దరఖాస్తు, నీటి కనెక్షన్ రికార్డు, ఖఖణాూ అనుమతులు

**బయటకు రావడమే నిజానిజాలను నిర్ధారించే మార్గం.**

**ఎపిసోడ్--3లో...**

ఆరేడు సంవత్సరాలుగా చర్య ఎందుకు లేదు?
నోటీసుల వెనుక కథ ఏంటి?
ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరిగిందా?
అధికారుల పాత్రపై విచారణ జరుగుతుందా?

## జగ్గంపేటలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విజన్ 11 కార్యక్రమం ప్రారంభం



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 8:** లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 316 బి పిలుపు మేరకు వీక్స్ ఆఫ్ సర్వీస్ విజన్ కార్యక్రమంలో భాగంగా జగ్గంపేట లయన్స్ క్లబ్ అధ్యక్షులు కంటే ఉదయ భాస్కర్ చౌదరి ఆధ్వర్యంలో గోకవరం రోడ్డులోని కొడూరి రంగారావు, సుబ్బులక్ష్మి లయన్స్ జిల్లా కంటి ఆసుపత్రి, రాజేశ్వరి రామకృష్ణ లయన్స్ కంటి వైద్యశాల ఆవరణలో గురువారం పలు సేవా కార్యక్రమాలు ఘనంగా ప్రారంభించిన డిస్టిక్ లైన్స్ గవర్నర్ చిట్టినీడి శ్రీనివాస్ ముందుగాలయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 8 నుండి 18 వరకు 11 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా జగ్గంపేట గోకవరం రోడ్డులోని ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ లో లైన్ కోడూరి శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాజేశ్వరి రామకృష్ణ లయన్స్ కంటి వైద్యశాలలో పేదలకు, స్కూల్ విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అంధత్వ నివారణ, కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, కంటి పరీక్షలు, అవసరమైన వారికి ఉచితంగా కళ్ళద్దాలు పంపిణీ, కేటరాక్ట్ ఆపరేషన్లకు ఎంపిక వంటి పలు సేవా కార్యక్రమాలను పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం ఇలా పలు సేవా కార్యక్రమాలు ఈ 11 రోజుల పాటు నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ప్రతినిధులు మెట్టరాధా,ఉమామహేశ్వరరావు, గ్రంధి వెంకటేశ్వరరావు, జిల్లా లైన్స్ హాస్పిటల్ ట్రస్ట్ నెంబర్ డాక్టర్ బాలగంగాధర్ రావు, జిల్లా లైన్స్ డెవలప్మెంట్ కమిటీ నెంబర్ కొత్త కొండబాబు, వల్లూరి గంగాధర్ రావు, వి రామారావు, నక్క సత్యనారాయణ, కోడూరి శ్రీనివాస్ జగ్గంపేట లయన్స్ క్లబ్ సభ్యులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పలు లైన్స్ క్లబ్ ప్రతినిధులు, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 45 రోజుల జిల్లా ప్రత్యేక శిక్షణ ప్రారంభం



**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 8:** ప్రాథమిక శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి కాకినాడ జిల్లాకు రిపోర్ట్ చేసిన సివిల్ పోలీస్ కానిస్టేబుళ్లకు 45 రోజుల జిల్లా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, గురువారం జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రారంభించారు. మహిళా సివిల్ పోలీస్ కానిస్టేబుళ్లు అక్టోబర్ 5న, పురుష సివిల్ పోలీస్ కానిస్టేబుళ్లు అక్టోబర్ 7న జిల్లా పోలీసు శాఖలో రిపోర్ట్ చేశారు. మొత్తం 269 మంది



కానిస్టేబుళ్లలో 189 మంది పురుషులు, 80 మంది మహిళలు ఉన్నారు. 45 రోజుల ప్రత్యేక శిక్షణలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, చట్టాలపై అవగాహన, ప్రజలతో వ్యవహరించే విధానం, పోలీస్ స్టేషన్లలో విధుల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ అందించనున్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని పోలీసు విధులకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) డా.మహంతి కిషోర్ కుమార్,ఏఆర్ డీఎస్పీ వి.జి. శ్రీహరి రావు,ఆర్‌ఐలు ఏఆర్ ఎం. నరసింహమూర్తి, కె.వెంకటరావు తదితరులు,269 మంది సివిల్ పోలీస్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## చూపును కాపాడుకుందాం.. వెలుగుల జీవితాన్ని ఆస్వాదిద్దాం



**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 8:** "కంటి చూపు మన జీవితానికి దేవుడిచ్చిన గొప్ప కానుక. చూపును కాపాడుకుందాం.. వెలుగుల జీవితాన్ని ఆస్వాదిద్దాం" అని వైద్యులు పిలుపునిచ్చారు.ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రామారావుపేటలోని జయంతి కంటి ఆసుపత్రిలో డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు నేత్రదానం పట్ల అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డా. అడ్డాల మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం అక్టోబర్ నెలలోని రెండో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు. చూపు లోపాలు, అంధత్వం పట్ల ప్రజల్లో అవగాహన పెంచడం, కంటి ఆరోగ్యం ప్రాముఖ్యతను తెలియజేయడం ఈ రోజు ముఖ్య ఉద్దేశమన్నారు. "చూపు విలువ తెలిసిన రోజే కంటి సంరక్షణ బాధ్యత పెరుగుతుంది. ప్రతి ఒక్కరూ తమ కళ్లను ప్రేమించి, కంటి ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి" అని కోరారు.కంటి వైద్య నిపుణులు డా.శ్రీకాంత్ మాట్లాడుతూ,కంటి ఆరోగ్య సంరక్షణ కోసం సంవత్సరానికి కనీసం ఒకసారి కంటి పరీక్ష చేయించుకోవాలని సూచించారు.విటమిన్-ఎ సమృద్ధిగా లభించే క్యారెట్లు,ఆకుకూరలు,చేపలు, గుడ్లు వంటి ఆహార పదార్థాలను తీసుకోవాలని తెలిపారు.డిజిటల్ పరికరాలను ఉపయోగించే సమయంలో 20-20-20 నియమాన్ని పాటించాలని సూచించారు.అంటే ప్రతి 20 నిమిషాలకు ఒకసారి 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్ల పాటు చూడాలని వివరించారు.అలాగే ఎండలో బయటకు వెళ్లేటప్పుడు సన్‌గ్లాసెస్ ఉపయోగించాలని, ప్రమాదకర పనులు చేసేటప్పుడు రక్షణ కళ్లజోడు ధరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజలు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## రక్తదానం మహాదానం -- డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి



**కాకినాడ, పెన్ పవర్,అక్టోబర్ 8:** డాక్టర్ బాదం బాలకృష్ణ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కాకినాడలోని ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ విభాగాల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మొత్తం 71 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు.ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ, డాక్టర్ బాదం బాలకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. లైన్స్ ఎలైట్ క్లబ్ అడ్మిన్ ఎం. విశ్వేశ్వరరావు రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు.కార్యక్రమానికి ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాలల కార్యదర్శి డాక్టర్ ఎన్. సుగుణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "రక్తదానం మహాదానం" అని అన్నారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని, యువత రక్తదాన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రక్తదానం గొప్ప సామాజిక సేవ అని, ఆరోగ్యవంతమైన ప్రతి వ్యక్తి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.
ఆదిత్య డిగ్రీ కళాశాలల్లో ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. అక్టోబర్ 11న జన్మదిన వేడుకలు జరుపుకోనున్న డాక్టర్ బాదం బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలిపి జ్ఞాపికను అందజేశారు.డాక్టర్ బాదం బాలకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో 71 మంది విద్యార్థులు రక్తదానం చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దుర్గరాజు పర్యవేక్షణలో రక్తసేకరణ నిర్వహించారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ డాక్టర్ బాదం బాలకృష్ణ అభినందించారు.ఈ కార్యక్రమంలో లైన్స్ ఎలైట్ క్లబ్ ప్రెసిడెంట్ ఎన్.ఏ.ఆర్.ఎల్.శర్మ, ఎలైట్ క్లబ్ ఐపీపీ కె.రవీంద్రనాథ్, లయన్స్ విజన్ క్లబ్ ప్రెసిడెంట్ కె. దుర్గ, సెక్రటరీ వాణికిషోర్, లైన్స్ క్లబ్ ఫ్రెండ్స్ ప్రెసిడెంట్ దేవులపల్లి లక్ష్మీపతి శాస్త్రి,జి. భాస్కరరావు, సురేష్‌కుమార్,ఎం.ఏ.మూర్తి తదితరులు పాల్గొని కార్యక్రమానికి సహకరించారు.
కళాశాల ప్రిన్సిపాల్స్ డి. బ్యూలా,మహమ్మద్ షాహిద్దీన్, సి.హెచ్. సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ టి. తేజేశ్వరరావు, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ కొక్కొండ రామ శేషగిరిరావు పంతులు దాతృత్వం వెలకట్టలేనిది.






**-పాఠశాలకు 16 ఎకరాల భూమి దానం చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది.**

**-సీనియర్ రాజకీయ నాయకులు ఎస్ఎస్ రామ్ కుమార్.**

**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్, 08:** శ్రీ కొక్కొండ రామశేషగిరిరావు పంతులు దాతృత్వం వెలకట్టలేనిదని సీనియర్ రాజకీయ నాయకులు ఎస్ ఎస్ రామ్ కుమార్ అన్నారు. శ్రీ కొక్కొండ రామ శేషగిరిరావు పంతులు 60వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రమైన కిర్లంపూడి శ్రీ కొక్కొండ రామ శేషగిరిరావు పంతులు ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో ఉన్న రామ శేషగిరిరావు పంతులు దంపతుల విగ్రహాలకు రామ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి రమణికుమారి తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రామ్ కుమార్ మాట్లాడుతూ 1958 కాలంలో రామశేషగిరిరావు పంతులు తన సొంత నిధులతో సుమారు పదహారు ఎకరాల భూమిని కొనుగోలు చేసి పాఠశాలకు దానం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఒక్క అడుగు నేల కూడా ఇవ్వని ఈ రోజుల్లో అప్పట్లో 16 ఎకరాలు దానం చేయడం అభినందనీయమన్నారు. ఆయన చలువ వల్ల ఈ పాఠశాలలో చదువుకున్న ఎందరో విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని పలు రంగాల్లో అన్ని విధాలా రాణించారని రామ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, పి రమణికుమారి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆళ్ళ బాబులు, మాజీ చైర్మన్ దాడి గోవిందు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కాంచన, పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం

**రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**





**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 8:** త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా, స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లతో పూర్తి సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ, (రిటైర్డ్) వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాకినాడ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో పాటు సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాల వారీగా చేపడుతున్న ముందస్తు సన్నద్ధతను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు వివరించారు. రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలపై సత్వర చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమావేశమై ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ ఎన్నికల ప్రక్రియను సులభతరం, సమర్థవంతంగా, తక్కువ వ్యయంతో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. బ్యాలెట్ పత్రాల ముద్రణ, ఎన్నికల సామగ్రి సేకరణ, పంపిణీ తదితర అంశాలపై ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

**పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలి**

**అత్యంత సమస్యాత్మక కేంద్రాల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి**

జిల్లాలో ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించేందుకు ఐఏఎస్ స్థాయి సాధారణ పరిశీలకులను నియమించే అవకాశం ఉన్నందున, వారి పర్యవేక్షణకు అనుగుణంగా అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును పర్యవేక్షించేందుకు సంబంధిత అధికారులను నియమించాలని, జోనల్ ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిస్టికల్ సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మీడియా సర్టిఫికేషన్, మీడియా కోఆర్డినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు తదితర మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది, సూక్ష్మ పరిశీలకుల నియామకంతో పాటు వారికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో చేపట్టాల్సిన బందోబస్తు ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలని, అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆయా కేంద్రాల్లో అవసరమైన భద్రతా చర్యలు, వీడియోగ్రఫీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల విధివిధానాలు, పోలింగ్‌కు సంబంధించిన వివరాలను సంబంధిత మొబైల్ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్ల ఏర్పాట్లలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిర్ణయించినట్లు తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ఒకే దశలో నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్దేశించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల రిజర్వేషన్లు, ఇతర అంశాలపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలిపారు. సంబంధిత మార్గదర్శకాలు వెలువడిన వెంటనే వాటికి అనుగుణంగా అవసరమైన చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి లోపాలకు తావులేకుండా ముందస్తు ఏర్పాట్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో తిప్పేనాయక్, అదనపు ఎస్పీ ఎం. కిషోర్ కుమార్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, డీపీఓ పి. రవికుమార్, మున్సిపల్ కమిషనర్లు ఎన్.వి.వి. సత్యనారాయణ, కె. శ్రీకాంత్ రెడ్డి, ఎస్. దివిజ, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు నేషనల్ స్కాలర్‌షిప్‌లు

- **ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి**
- **దరఖాస్తులకు అక్టోబర్ 31 చివరి గడువు**

**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 9:** 2026--27 విద్యా సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయనున్న నేషనల్ స్కాలర్‌షిప్‌ల కోసం అర్హులైన విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కాకినాడ జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఏవై శ్రీనివాసు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్, గ్రాడ్యుయేషన్, డిప్లొమా తదితర కోర్సులు చదువుతున్న విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. 9, 10వ తరగతులు చదువుతున్న వారికి ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ఇంటర్మీడియట్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు చదువుతున్న వారికి పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

అలాగే గుర్తింపు పొందిన సంస్థల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ లేదా డిప్లొమా కోర్సులు చదువుతున్న విద్యార్థులకు టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ కింద స్కాలర్‌షిప్‌లు అందించనున్నట్లు తెలిపారు. ఈ అన్ని విభాగాలకు దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబర్ 31, 2026 చివరి తేదీగా నిర్ణయించినట్లు వెల్లడించారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నేషనల్ స్కాలర్‌షిప్‌కు అర్హులైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలని సహాయ సంచాలకులు సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు అనంతరం సంబంధిత వివరాలు లేదా అప్లికేషన్ హార్డ్‌కాపీని తమ విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు లేదా కళాశాల ప్రిన్సిపాల్‌కు సమర్పించాలని తెలిపారు. జిల్లాలో పేర్కొన్న కోర్సుల్లో విద్యాభ్యాసం చేస్తున్న అర్హులైన విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని పొందేందుకు విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన అర్హతలు, మార్గదర్శకాలు, ఇతర పూర్తి వివరాలు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థుల ఆర్థిక సాయం



**గండేపల్లి పెన్ పవర్,(సూరంపాలెం), అక్టోబర్ 08:** అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడి వైద్య చికిత్సకు ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ నుంచి అందిన సమాచారానికి స్పందించిన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రూ. 65,785 విరాళంగా సేకరించారు. సేకరించిన మొత్తాన్ని ఆదిత్య యూనివర్సిటీ ప్రో-వైస్ ఛాన్సలర్ (అకడమిక్స్) డా. ఎస్. రమాశ్రీ చేతుల మీదుగా అనారోగ్యంతో బాధపడుతున్న మాస్టర్ మోసెస్ రాయల్ తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. బాలుడి వైద్య చికిత్స కోసం మానవతా దృక్పథంతో స్పందించి విరాళాలు అందించిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డీన్--స్టూడెంట్ యాక్టివిటీస్ డా. డి. కిషోర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీ కన్వీనర్ డా. ఐ.వి. వీరాంజనేయులు సూచనల మేరకు ఈ సహాయ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## మందేశ్వరస్వామిని దర్శించుకున్న మెప్మా మిషన్ డైరెక్టర్



**కొత్తపేట, పెన్ పవర్, అక్టోబర్ 8:** మందపల్లి శ్రీ మందేశ్వరస్వామి వారిని మెప్మా మిషన్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి ఎన్. తేజ్ భరత్ గురువారం దర్శించుకున్నారు. ముందుగా స్వామివారికి తైలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అర్చకులు, వేదపండితులు ఆలయ సంప్రదాయాల ప్రకారం ఆయనకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు. దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఆయనకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టత, స్వామివారి సేవలు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు అందించినట్లు తెలిపారు.

## ప్రజలకు చట్టాలపై కనీస అవగాహన అవసరం

- **చట్టాలపై అవగాహనతో మోసాలకు దూరంగా ఉండొచ్చు**
- **జడ్జి బి.హెచ్.వి. లక్ష్మీకుమారి**




**రామచంద్రపురం పెన్ పవర్, అక్టోబర్ 8:** ప్రజలు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే సమాజంలో ఇతరుల చేత మోసపోకుండా జీవించేందుకు అవకాశం ఉంటుందని రామచంద్రపురం మండల న్యాయ సేవల కమిటీ ఛైర్మన్, ౹×××× అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు జడ్జి బి.హెచ్.వి. లక్ష్మీకుమారి అన్నారు. గురువారం రామచంద్రపురం జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి రాజగోపాల్ సెంటర్ వరకు మండల న్యాయ సేవల కమిటీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజగోపాల్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు.

ఈ సందర్భంగా జడ్జి బి.హెచ్.వి. లక్ష్మీకుమారి మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థల చట్టం , ఉచిత న్యాయ సాయం, జాతీయ లోక్ అదాలత్ ప్రాముఖ్యత, వరకట్న నిషేధ చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే బాలికల విద్య ప్రాముఖ్యత, నల్సా పథకాలు, లింగ సమానత్వం, రాజ్యాంగ విలువలు, మధ్యవర్తిత్వం , కౌన్సెలింగ్, వైవాహిక వివాదాల పరిష్కారం వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ తిరుమలరావు, రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోటిపల్లి లోవరాజు, కార్యదర్శి నీలం మధుసూదనరావు, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది సుభాషిని, ఎస్ఐ ఎస్. నాగేశ్వరరావు, అదనపు ఎస్ఐ డి.వి.రమణరావు, పోలీసు సిబ్బంది, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు కె.దుర్గ, అంగన్వాడీ కార్యకర్తలు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ సబ్ డివిజన్ నూతన ఎస్డీపీవోగా ఎన్.ఎస్.వి.కె. దుర్గారావు బాధ్యతల స్వీకరణ

- **ఎస్పీ బిందుమాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎస్డీపీవో**
- **శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం**





**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 8:** కాకినాడ సబ్ డివిజన్ నూతన సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (ఎస్డీపీవో)గా ఎన్.ఎస్.వి.కె. దుర్గారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో దుర్గారావు విజయవాడ వెస్ట్ జోన్ ఏసీపీగా విధులు నిర్వహించారు. ఇప్పటివరకు కాకినాడ ఎస్డీపీవోగా అదనపు ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. నూతన ఎస్డీపీవోగా బాధ్యతలు స్వీకరించిన ఎన్.ఎస్.వి.కె. దుర్గారావుకు జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలి: ఎస్పీ బిందుమాధవ్ ,కాకినాడ సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. ప్రజలకు వేగవంతమైన, మెరుగైన పోలీసు సేవలు అందించేలా నిబద్ధతతో పనిచేయాలని నూతన ఎస్డీపీవోకు సూచించారు. సబ్ డివిజన్ పరిధిలో ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరిస్తూ పోలీసు శాఖపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందించేలా విధులు నిర్వహించాలని తెలిపారు.

## ఆదిత్య యూనివర్సిటీలో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్‌పై హ్యాండ్స్--ఆన్ వర్క్‌షాప్‌లు




**గండేపల్లి, పెన్ పవర్,(సూరంపాలెం) అక్టోబర్ 08** ఆదిత్య యూనివర్సిటీ ఈ.సి.ఇ. విభాగం ఆధ్వర్యంలో బీటెక్ మూడవ సెమిస్టర్ విద్యార్థుల కోసం 'జనరేటివ్ ఏఐ', 'గూగుల్ క్లౌడ్ కంప్యూటింగ్ ఫౌండేషన్స్' అంశాలపై రెండు రోజుల చొప్పున హ్యాండ్స్––ఆన్ వర్క్‌షాప్‌లను నిర్వహించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనతో పాటు, ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ సాధనాలను ప్రాక్టికల్‌గా వినియోగించే నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించడం లక్ష్యంగా కార్యక్రమాలను నిర్వహించారు.

'జనరేటివ్ ఏఐ' వర్క్‌షాప్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ భాగస్వామ్య సంస్థ ఎల్4జి సొల్యూషన్స్‌కు చెందిన టెక్నికల్ ట్రైనర్ జయగోపినాథ్ అలవాలా రిసోర్స్ పర్సన్‌గా హాజరై శిక్షణ అందించారు. జనరేటివ్ ఏఐ ప్రాథమిక అంశాలతో పాటు ఆధునిక ఏఐ టూల్స్, ప్రాంప్ట్ ఇంజినీరింగ్, ఏఐ ఆధారిత కంటెంట్ జనరేషన్, కోడ్ జనరేషన్ తదితర అంశాలను ప్రాక్టికల్ ఉదాహరణలతో వివరించారు. అదేవిధంగా లి'గూగుల్ క్లౌడ్ కంప్యూటింగ్ ఫౌండేషన్స్'లిపై నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్‌కు ట్రైనర్, డెవలపర్ ఆకాష్ పీకా రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు. క్లౌడ్ కంప్యూటింగ్ ప్రాథమిక అంశాలు, గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫారమ్, వివిధ క్లౌడ్ సర్వీసులు, క్లౌడ్ ఆధారిత అప్లికేషన్ల వినియోగంపై విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఈ.సి.ఇ. విభాగాధిపతి డా. సి.హెచ్. జానకి దేవి మాట్లాడుతూ, అకడమిక్ అభ్యాసంతో పాటు పరిశ్రమలో వినియోగిస్తున్న ఆధునిక సాంకేతికతలపై విద్యార్థులకు ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని అందించడం విభాగం ప్రధాన లక్ష్యాల్లో ఒకటన్నారు. జనరేటివ్ ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్‌పై విద్యార్థులు పొందిన నైపుణ్యాలు అకడమిక్ ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధన, హ్యాకథాన్‌లు, ప్లేస్‌మెంట్ అవకాశాల్లో ఉపయోగపడతాయని తెలిపారు.

ఈ రెండు వర్క్‌షాప్‌ల ద్వారా కోర్ విద్యతో పాటు ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ టెక్నాలజీలకు సంబంధించిన పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. తద్వారా అకడమిక్ అభ్యాసానికి, పరిశ్రమ అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు కార్యక్రమాలు దోహదపడ్డాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డా. అరిగేల లక్ష్మణ సిరిధర, డా. ఎన్.వి. లలిత, డిప్యూటీ విభాగాధిపతులు డా. సి.హెచ్. రవి శంకర్, డా. కె.హెచ్.కె. ప్రసాద్, విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాత మంజేరులో శరన్నవరాత్రి మహోత్సవాలకు పందిరి నాట





**కాజులూరు, పెన్ పవర్, అక్టోబర్ 8:** కాజులూరు మండల పరిధిలోని పాత మంజేరు గ్రామంలో శ్రీ నవదుర్గ మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు గురువారం ఘనంగా శ్రీకారం చుట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో పందిరి నాట కార్యక్రమాన్ని భవానీలు, గ్రామ పెద్దలు సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు.ఆలయ ధర్మకర్త దడాల నాగార్జున, నాగేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేపడుతున్నట్లు ధర్మకర్త తెలిపారు. అమ్మవారి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఆలయ పరిసరాల్లో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.పందిరి నాట కార్యక్రమంలో భవానీలు, గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామస్తులు సహకరించాలని ఆలయ ధర్మకర్త కోరారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం

**గండేపల్లి, పెన్ పవర్, అక్టోబర్ 08:** ఆదిత్య యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ బిజినెస్, ఎన్ఎస్ఎస్ యూనిట్––8 ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన కోటపాడులో 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజ శ్రేయస్సు, పరిసరాల పరిశుభ్రత లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టి పరిసరాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ సజావుగా సాగేలా చూడవచ్చని నిర్వాహకులు వివరించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి, డీన్ స్టూడెంట్ యాక్టివిటీస్ డాక్టర్ డి. కిషోర్, ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ కన్వీనర్ డాక్టర్ ఐ.వి. వీరాంజనేయులు, స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్, ప్రో వీసీ డాక్టర్ రవి తంగ్జమ్, అసోసియేట్ డీన్ డాక్టర్ బి. సౌజన్య పాల్గొని పరిశుభ్రత ప్రాధాన్యతను వివరించారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ఆర్. లక్ష్మి దేవరకొండ, అధ్యాపకురాలు సుష్మా అంజనీ దేవి, ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకులు చురుగ్గా పాల్గొన్నారు. కోటపాడు గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు సహకరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పంచాయతీ సిబ్బందికి, సహకరించిన గ్రామస్తులకు ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా ఆత్మ బ్లాక్ రైతు సలహా కమిటీ ప్రమాణస్వీకారం





- రైతు సమస్యల పరిష్కారానికి వారధిగా పనిచేయాలి
- వాసంశెట్టి సత్యం

**రామచంద్రపురం, పెన్ పవర్, అక్టోబర్ 8:** వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మ బ్లాక్ రైతు సలహా కమిటీ నూతన సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం, తొలి సమావేశం రామచంద్రపురంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏడీ నాగకుమార్ నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం కమిటీ చైర్మన్‌గా ఎంపికైన వెంటూరి వీర రాఘవ చౌదరితో పాటు సభ్యులను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పంటల సాగు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఉద్యానవన, పశుసంవర్ధక రంగాల అభివృద్ధి, రైతులకు ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రైతులకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఆత్మ బ్లాక్ రైతు సలహా కమిటీ పనిచేయాలని సూచించారు. రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ సంక్షేమ పథకాలు ప్రతి రైతుకు చేరేలా కమిటీ సభ్యులు చొరవ చూపాలని సత్యం సూచించారు. రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను రైతులకు చేరువ చేయాలని ఆకాంక్షించారు. నూతన కమిటీలో చైర్మన్‌గా వెంటూరి వీర రాఘవ చౌదరి (కోటిపల్లి, కె.గంగవరం) వ్యవహరించనున్నారు. వ్యవసాయ రంగ ప్రతినిధులుగా కొటిపల్లి వీర ప్రసాద్, పదం వసంత్ శ్రీనివాస్, వాసంశెట్టి చంద్రశేఖర్, కొలు రమణ కుమారి, పెంకే యమున; ఉద్యానవన శాఖ ప్రతినిధులుగా వాసంశెట్టి దుర్గారావు, వాసంశెట్టి గంగరాజు, గుండుమేను మహాలక్ష్మి, దార్ల నీరజ; పశుసంవర్ధక రంగ ప్రతినిధులుగా అకేటి శ్రీకృష్ణ, సంగాటి లోవరాజు,గన్ని అరుణ కుమారి, మెండు నాగమణి నియమితులయ్యారు. మహిళా రైతు ప్రతినిధులుగా కాటేడి శాంతకుమారి, మోకాన శ్యామల, యువ రైతు ప్రతినిధులుగా మోర్తా రవికుమార్, దేవరపల్లి నాగచక్రధర్, రైతు సంఘాల ప్రతినిధులుగా కట్టా శ్రీనివాసు, గెద్దం దొరయ్య తదితరులు కమిటీలో చోటు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు మణిదీప్, సద్గురుమూర్తి, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవెల్లి శివ, గంగవరం మండల టీడీపీ అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, గరికపాటి సూర్యనారాయణ, కంచుమర్తి బాబురావు, వయిట్ల గజలక్ష్మి, కూటమి పార్టీ నాయకులు, రైతు ప్రతినిధులు, నూతన కమిటీ సభ్యులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం కొండంత భరోసా





**జ్యోతుల నవీన్ కుమార్**

**గండేపల్లి, పెన్ పవర్,అక్టోబర్ 08:** గండేపల్లి మండలంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం మానవీయతకు అద్దం పట్టేలా సాగింది. కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల యోగక్షేమాలు, ఆరోగ్య పరిస్థితిని ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు.మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో ఇద్దరికి రూ.1,90,517, మల్లేపల్లిలో ముగ్గురికి రూ.53,860, సురంపాలెంలో ఏడుగురికి రూ.4,40,792, పి. నాయకంపాలెంలో ఇద్దరికి రూ.1,76,363, తాళ్లూరులో ఒకరికి రూ.98,117, మురారిలో ఒకరికి రూ.16,795 చొప్పున చెక్కులను అందజేశారు. మొత్తం ఆరు గ్రామాలకు చెందిన 16 మంది లబ్ధిదారులకు రూ.9,76,444 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి కొండంత భరోసాగా నిలుస్తోందన్నారు. ఒకవైపు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తూనే, మరోవైపు అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నామని తెలిపారు.జగ్గంపేట నియోజకవర్గ శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజల కష్టాల్లో వారికి అండగా నిలవడమే తమ ధ్యేయమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేర్చడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, జిల్లా టీడీపీ కార్యాలయ కార్యదర్శి కోర్పు సాయి తేజ, పుష్కర ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు, గండేపల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ కుంచె రాజా, క్లస్టర్ ఇన్‌చార్జి జాస్తి వసంత్, అడబాల ఆంజనేయులు, అనుకూల శ్రీకాంత్, కుంచే రామకృష్ణ, పాలకుర్తి ఆదినారాయణ, యల్లమిల్లి సీఎం, ఉండవల్లి చందు తదితరులు పాల్గొన్నారు.

# భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను తక్షణమే తొలగించాలి.

-రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష పార్టీలు డిమాండ్.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్, 08:** ఎన్నికల సంఘం స్వతంత్రతను,, విశ్వసనీయతను దెబ్బతీసిన భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని అఖిలపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. గురువారం నియోజకవర్గ స్థాయిలో స్థానిక సిపిఐ(ఎంఎల్ )లిబరేషన్ కార్యాలయంలో అఖిలపక్ష పార్టీలు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఉమ్మిడి వెంకట్రావు, సిపిఎం కన్వీనర్ రొంగల ఈశ్వరరావు,సిపిఐ (ఎంయల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మానుకొండ లచ్చబాబు,సామాజిక కార్యకర్త ఏండి అధికార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నిలిపివేయాలని ,ఓటర్ల జాబితా నుంచి అన్యాయంగా తొలగింపునకు గురైన వారందరికీ ఓటు హక్కును పునరుద్ధరించాలని కోరారు.స్వతంత్రత,ప్రజాస్వామ్యత పనితీరును పునరుద్ధరించాలని ,ఎన్నికల కమిషనర్ల నియామకానికి ఉన్న ప్రస్తుత వ్యవస్థను తొలగించాలని ప్రధానమంత్రి ,ప్రతిపక్ష ,నాయకుడు ,భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన సుప్రీంకోర్టు ప్రతిపాదించిన ఎంపిక కమిటీ ఆధారత యంత్రాంగాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం అక్టోబర్ 12 నిరసన నిర్వహించాలని అఖిలపక్ష పార్టీలు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో చోటుచేసుకున్న పరిణామాలపై ఇండియన్ ఎక్స్ప్రెస్ ప్రచురించిన కథనాన్ని వారు ప్రస్తావించారు. ముగ్గురు ఎన్నికల కమిషనర్లు ఇద్దరు లేవనెత్తిన మౌలికమైన కొన్ని ప్రశ్నలు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నేతృత్వంలో ఎన్నికల సంఘం పనితీరునే ప్రశ్నార్థకం చేస్తున్నాయని విమర్శించారు. ఇవి కేవలం ఓటర్ల జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణకు మాత్రమే పరిమితం కాలేదని,భారత ఎన్నికల సంఘం పనితీరు సమగ్రతపై కూడా తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తున్నాయని తెలిపారు. సిఇసి కార్యాలయం విశ్వసనీయత దెబ్బతిందని, రాజీ పడిందని ఆ వివరాలు వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు. కావున అక్టోబర్ 12 వ తారీఖున నియోజకవర్గ కేంద్రంలో జరిగే నిరసన కార్యక్రమంలో లౌకిక,ప్రజాస్వామ్య,పౌర సమాజ సంస్థలు ,పౌరులు అందరు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు ధరణాల కోట శ్రీను,ప్రజా సంఘాల నాయకుడు నిట్ల శ్రీను, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డి.సుబ్బరాజు,డి వెంకటేశ్వరరావు,పి.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్తిపాడు మండలంలో పలు కుటుంబాలకు ముద్రగడ గిరిబాబు పరామర్శ.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,అక్టోబర్, 08:**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు గురువారం ప్రత్తిపాడు మండలంలో పలు కుటుంబాలను పరామర్శించారు. నియోజకవర్గానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ పవన్ కుమార్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ముద్రగడ గిరిబాబు గురువారం ప్రత్తిపాడులోని డాక్టర్ పవన్ కుమార్ హాస్పిటల్‌కు వెళ్లి డాక్టర్ పవన్ కుమార్ ను కలిసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.వారి మాతృమూర్తి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.శరభవరం గ్రామానికి చెందిన దుళ్ళ సూర్యనారాయణ సతీమణి దుళ్ళ నాగరత్నం ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న గిరిబాబు వారి నివాసానికి వెళ్లి నాగరత్నం చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. నాగరత్నం పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. అదే గ్రామానికి చెందిన సుగసాని సూర్యప్రకాశరావు సోదరుడు సుగసాని వెంకటపతిరావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ముద్రగడ గిరిబాబు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తారు. ప్రత్తిపాడు మండలం పోతులూరు గ్రామానికి చెందిన శెట్టి అప్పారావు ఇటీవల మృతి చేశారు. విషయం తెలుసుకున్న ముద్రగడ వారి కుటుంబ సభ్యులు శెట్టి వెంకటరమణ, శెట్టి సత్తిబాబు,శెట్టి చక్రం,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన స్వర్గీయ ముద్రగడ వీరాభిమాని సర్వేపల్లి సాయిబాబా ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న గిరిబాబు సాయిబాబా నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన బండారు రాజు మాతృమూర్తి చిన్నతల్లి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ముద్రగడ గిరిబాబు రాజు నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు.ప్రత్తిపాడు గ్రామానికి చెందిన డాకే శ్రీను సతీమణి జ్యోతి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ముద్రగడ గిరిబాబు శ్రీను నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.ప్రత్తిపాడు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఫైర్ ఆఫీసర్, పిల్ల చిట్టిబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయము తెలుసుకున్న ముద్రగడ గిరిబాబు చిట్టిబాబు నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామానికి చెందిన సారా సుబ్బయ్య కుమారుడు సారా లోవదుర్గ ఇటీవల ఆకస్మిక మృతి చెందారు. విషయం తెలుసుకున్న ముద్రగడ గిరిబాబు సుబ్బయ్య నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేసారు. ఆయన వెంట మండల వైసిపి అధ్యక్షుడు రామిశెట్టి నాని, ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి ఎస్సి సెల్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, బెహరా దొరబాబుశేరు కృష్ణ, ఏనుగు శ్రీనివాసరావు, శెట్టి సత్తిబాబు, రామిశెట్టి దొరబాబు, బర్రే రామకృష్ణ, అమరాది కాశీ, చిలకమర్తి వెంకటరమణ, ఏడిద రెడ్డినాయుడు మండలంలోని పలువురు వైసిపి నాయకులు ఉన్నారు.

## చట్టాలపై అవగాహన కల్పించేందుకే న్యాయ సదస్సులు.

**జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి ఐ.ప్రవీణ్ కుమార్..**




**ఆలమూరు, పెన్ పవర్ అక్టోబర్ 08:**గ్రామీణ ప్రాంత ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకే న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహిస్తున్నట్లు ఆలమూరు జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి ఐ.ప్రవీణ్ కుమార్ అన్నారు.నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆధ్వర్యంలో గురువారం న్యాయ సేవల పథకాలపై ప్రజలకు, కక్షిదారులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి ఐ. ప్రవీణ్ కుమార్, స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఎం. సన్నిధిరావు, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఎం. విజయ తాతల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది.ముందుగా కోర్టు సిబ్బంది, న్యాయవాదులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోర్టు ఆవరణలో కక్షిదారులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో న్యాయమూర్తులు మాట్లాడారు. కక్షిదారులు తమ మధ్య ఉన్న రాజీ పడదగ్గ కేసులను లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. దీనివల్ల కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ తగ్గడమే కాకుండా, సమయం, డబ్బు ఆదా అవుతాయని పేర్కొన్నారు. అలాగే అర్హులైన పేదలు, బలహీన వర్గాల వారు లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో ఆలమూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.కె. షరీఫ్, సీనియర్ న్యాయవాదులు అబ్బులు నాయుడు,ఆదినారాయణ మూర్తి, అంగర సత్యనారాయణ, మహేశ్వరరావు, కోర్టు సిబ్బంది,పెద్ద సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

## పెదమల్లాపురంలో మాజీ ఎమ్మెల్యే జనసేన నాయకుడు వరుపుల సుబ్బారావు కు ఘన స్వాగత...

**బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్పు...**



**శంఖవరం పెన్ పవర్ అక్టోబర్ 08:-** కాకినాడ జిల్లా లో శంఖవరం మండలంలోని పెదమల్లాపురం గ్రామంలో జనసేన పార్టీ నాయకులు, ప్రత్తిపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు వరుపుల సుబ్బారావు గురువారం పర్యటించారు. ఇటీవల జనసేన పార్టీలో చేరిన అనంతరం తొలిసారిగా గ్రామానికి వచ్చిన ఆయనకు గిరిజన గ్రామ ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. గ్రామానికి వచ్చిన సుబ్బారావును పలువురు గ్రామ పెద్దలు, మహిళలు, పార్టీ అభిమానులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఇటీవల కంటికి శస్త్రచికిత్స చేయించుకున్న గ్రామ మాజీ అధ్యక్షుడు పసగడుగుల నాగేశ్వరరావును వరుపుల సుబ్బారావు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన బాడోజు మల్లికార్జున భార్య చంటమ్మ కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

గ్రామ పర్యటన సందర్భంగా వరుపుల సుబ్బారావును గిరిజన గ్రామ ప్రజలు ఆప్యాయంగా కలిసి తమ సమస్యలను కూడా వివరించారు. గ్రామంలో నెలకొన్న స్థానిక సమస్యలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు ప్రజలు తెలిపిన సమస్యలను సావధానంగా విన్న సుబ్బారావు, సంబంధిత అంశాలపై తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు.

ఈ సందర్భంగా బాడోజు లక్ష్మీ, తోట రాములమ్మ, జర్త సరస్వతి, మాడెం లక్ష్మి, బాడోజు శ్రీను, విద్యా కమిటీ చైర్మన్ మల్లం లక్ష్మణరావు, మీసాల శ్రీకృష్ణ, లోవరాజు, సూర్యనారాయణ, పాకల రమణ, తమ్మారావు తదితరులు వరుపుల సుబ్బారావును మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మేకల కృష్ణ, గొర్లి నాగేశ్వరరావు,బలుపు రాంబాబు,కర్నం రాజారావు,తిరురెడ్డి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడేలా ప్రభుత్వం పటిష్ట చర్యలు.





**ఏలేరు జలాశయంలో12,30,000 చేప పిల్లలు విడుదల.**

**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 8:** మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడేలా ప్రభుత్వం పటష్ట చర్యలు తీసుకుంటుందని ఏలేశ్వరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు అన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏలేరు రిజర్వాయర్ లో 12,30,000 చేప పిల్లలను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న జ్యోతుల పెదబాబు మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా కోట్లాది రూపాయలు మత్స్యకారుల జీవన స్థితిగతుల మెరుగుదల కోసం కేటాయించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్య సంపద పెంపుదలకు, మత్స్యకారులకు వలలు అందిస్తుందని దీనిని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మత్స్యశాఖ కాకినాడ జిల్లా అధికారి వి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో చేప పిల్లల ఉత్పత్తికి ప్రభుత్వ ప్రోత్సాహంతో అనేక కేంద్రాలను ఏర్పాటు చేసి లక్షల సంఖ్యలో చేప పిల్లలను వృద్ధి చేయడం జరుగుతుందన్నారు. వృద్ధి చేసిన చేప పిల్లలను మత్స్యకారుల నుంచి ఎలాంటి రుసుము తీసుకోకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో చేప పిల్లలను ప్రాజెక్టుల్లో విడుదల చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మేజర్ ప్రాజెక్టుతో పాటు మైనర్ ప్రాజెక్టులు సొసైటీ చెరువులు వంటి వాటిని చేప పిల్లలు విడుదల ద్వారా మత్స్యకారులకు ప్రభుత్వం ఆసరా కల్పిస్తుంది అన్నారు. దీనిలో భాగంగా ఏలూరు జిల్లా కైకలూరు నుండి బొచ్చు, రాగండి, ఎర్రమైల రకాల చేప పిల్లలను తేవడం జరిగిందని వాటిని ప్రతిపాడు మండలం సుబ్బారెడ్డి సాగర్ లో 90 వేల చేప పిల్లలను, అలాగే ఏలేరు ప్రాజెక్టులో 11.40 లక్షల చేప పిల్లలను విడుదల చేయడం జరిగిందన్నారు. అలాగే ప్రాజెక్టు ప్రాంతంలో ఎవరైనా చేప పిల్లల అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటే వారికి ప్రభుత్వం భూమిని కేటాయించడం చేయడం జరుగుతుందన్నారు. మేలు జాతి చేప పిల్లలను ఉత్పత్తి చేయడం ద్వారా అధిక లాభాలను సాధించవచ్చని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. అలాగే మత్స్యకారులకు ఆరు కోట్ల రూపాయలు విలువైన వాహనాలను, వలలను చిన్నచిన్న బోట్లను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ వైస్ చైర్మన్ పి. రంగారావు , కోనసీమ మత్స్యశాఖ జిల్లా అధికారి కె కరుణాకర్ రావు, తాళ్లరేవు అదనపు జిల్లా అధికారి అనురాధ దేవి, మండల తాసిల్దార్ కె. కీర్తి మండల అభివృద్ధి అధికారి రామరాజు వర్మ, ఏలేశ్వరం మత్స్యశాఖ పర్యవేక్షణ అధికారి బి. రాజేంద్ర రావు, ఫీల్డ్ మాన్ సురేష్, హేమంత్, పవన్ కుమార్, అచ్చిరాజు స్థానిక నాయకులు కూటమి నాయకులు అలర్క్ రాజు, నూకతాటి ఈశ్వరుడు, మత్స్యకారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు న్యాయ వ్యవస్థ పట్ల అవగాహన కలిగి ఉండాలి.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్, 08:**సుప్రీంకోర్టు డైరెక్షన్ల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్రత్తిపాడు నైపుణ్య డిగ్రీ కళాశాలలో న్యాయ అవగాహనా సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గోపినాథ్ వరకట్న సాంఘిక దురాచారం, లింగ సమానత్వం,రాజ్యాంగ విలువలు, మహిళల హక్కులు మొదలగు అంశాల గురించి విద్యార్థులకు విపులంగా వివరించారు.విద్యార్థినిలు చిన్న విషయాలకి కృంగిపోకుండా దృఢత్వంతో శక్తి స్వరూపిణిల వలె ఉండాలని, రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి తెలియజేశారు.న్యాయ సేవాధికార సంస్థలు వల్ల పొందు సౌకర్యం గురించి తెలియపరచి,ఇంటి చుట్టూ పక్కల వారందరికీ తెలియజేయమని చెప్పారు.సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శారదామణి వివిధ ఆర్టికల్స్ గురించి వివరించారు.ఎంఈఓ అచ్చిరాజు మాట్లాడుతూ విద్య ఉంటే అన్ని విషయాలలో విజయం పొందవచ్చని చట్టాల గురించి ప్రతి మనిషి తెలుసుకొని ఉండటం వల్ల తమతో పాటు తమ చుట్టుపక్కల వారికి ఎంతో ఉపయోగకర వ్యక్తిగా జీవించవచ్చని తెలియపరిచారు.విద్య మీద పాట పాడుతూ విద్యార్థులను ఉత్తేజపరిచినారు.ఐసీడిఎస్ సిబ్బంది వరలక్ష్మి చిన్న వయసులో వివాహాలు చేసుకొనుట వల్ల జరుగు నష్టాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో మండల న్యాయ సేవాధికార సంస్థ పానల్ అడ్వకేట్ పిల్లి బలరాముడు, నైపుణ్య కాలేజ్ కరస్పాండెంట్ సత్య పాల్గొన్నారు.




## చీడపీడల పట్ల అప్రమత్తంగా ఉండాలి..




**శంఖవరం పెన్ పవర్ అక్టోబర్ 08:-** ప్రస్తుతం పంటల్లో వివిధ చీడపీడలు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి పి గాంధీ రైతులకు సూచించారు.కత్తిపూడిలో రాగిపంట నారుమడి మరియు కంది పంటను రైతులతో పరిశీలించి రాగి(చోడి) నారుమడిలో అగ్గితెగులు గమనించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో మారేడుపత్ర కషాయం లేదా ట్రైసైక్లజోల్ 0.6గ్రా. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.కంది పంటలో ఎండు తెగులు గమనించి

సూడోమోనాస్ 10గ్రా. లేదా కాపర్ ఆక్సి క్లోరైడ్ 3గ్రా. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వరిలో పొడ తెగులు నివారణకు సొంటిపాల కషాయం లేదా హెక్సాకొనజోల్ 2మి.లీ.నీటిలో కలిపి మొదళ్ళు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ ఎం టి సోమరాజు, రైతులు,సిబ్బంది పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్నవారికి ఆత్మీయ చేయూత ముఖ్యమంత్రి సహాయనిధి.

**-కిర్లంపూడి మండలంలో ఇంటింటికీ వెళ్లి సీఎం సహాయనిధి చెక్కులు అందజేసిన జ్యోతుల నవీన్**

**-5 గ్రామాల్లో 7 మందికి రూ.1.77 లక్షల ఆర్థిక భరోసా.**

**కిర్లంపూడి,పెన్ పవర్,అక్టోబర్, 8:**కిర్లంపూడి మండలంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం హృదయాన్ని తాకేలా సాగింది. కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ బాధితుల ఇళ్లకు స్వయంగా వెళ్లి చెక్కులను అందజేసి వారి యోగక్షేమాలు, ఆరోగ్య వివరాలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. మండలంలోని బూరుగుపూడి గ్రామంలో ఒకరికి రూ.38,879, సోమవారం గ్రామంలో ఒకరికి రూ.20,795, సోమరాయిపేట గ్రామంలో ఒకరికి రూ.31,085, జగపతినగరంలో ఇద్దరికి రూ.46,112, సింహాద్రిపురంలో ఇద్దరికి రూ.40,544 చొప్పున మొత్తం ఐదు గ్రామాలకు చెందిన 7 మంది లబ్ధిదారులకు కలిపి రూ.1,77,433 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ అనారోగ్యం ఎవరికీ చెప్పి రాదని, అలాంటి కష్ట సమయంలో ప్రభుత్వం అండగా ఉండాలని, అదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పేదవాడి కంట కన్నీరు తుడిచేందుకే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రతి అర్హుడిని ఆదుకుంటున్నామని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రజలకు రెట్టింపు భరోసా కల్పిస్తున్నామని, ముఖ్యంగా జగ్గంపేట నియోజకవర్గ శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఒక్క అర్హుడు కూడా సహాయానికి దూరం కాకూడదనే లక్ష్యంతో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజల ఇంటి తలుపు తట్టి మరీ సహాయం అందించడమే తమ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు.



ఈ కార్యక్రమంలో చదరం చంటిబాబు, తూము కుమార్, అనుకుల శ్రీకాంత్, కుంచే తాతాజీ, పాఠంశెట్టి మురళీకృష్ణ, కుర్ల చినబాబు, కాళ్ల వెంకటేష్,పలువురు కూటమి నాయకులు ఆయా గ్రామాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# చిన్నారుల బంగారు భవిష్యత్తుకు పునాది అంగన్‌వాడీ కేంద్రాలే

**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 8:** చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం, సమగ్ర వికాసమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని తహసీల్దార్ రమేష్ పిలుపునిచ్చారు. గురువారం జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో తొమ్మిదో జాతీయ పోషణ మాసం - 2026 ప్రాజెక్టు స్థాయి ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తుపైనే రాష్ట్ర, దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 8 వరకు మూడు మండలాల్లోని 182 అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రుల్లో పిల్లల ఆరోగ్యం, పోషణ, పెంపకం పట్ల అవగాహన పెంచడంతో పాటు చిన్న నాటి నుంచే నైతిక విలువలను పెంపొందించి బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను కేవలం ప్రభుత్వ సేవలందించే కేంద్రాలుగా కాకుండా, ప్రజల భాగస్వామ్యంతో పనిచేసే సామాజిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నారు. పోషణ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన చిరుధాన్యాలతో కూడిన పోషకాహార పదార్థాల ప్రదర్శన శాలలను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎండిఓ ఎస్.శ్రీనివాస్ రెడ్డి, ఏపీఎం కె.నాగేశ్వరరావు, ఎంఈఓ స్వామి, సహాయక ప్రాజెక్టు అధికారి, వైద్య ఆరోగ్య అధికారి, మహిళా పోలీస్, పర్యవేక్షకులు సునీత, అమ్మాజీ, కరీమున్నిశ, ఆశా, ఆరోగ్య సహాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వీఎస్ఎస్ షేర్ అమౌంట్ ఇవ్వాలి



**జీలుగుమిల్లి, పెన్ పవర్, అక్టోబర్ 8;** వన సంరక్షణ సమితి లో అందరితో కలిసి పనిచేసాము కానీ కొంతమంది మాత్రమే షేర్ అమౌంట్ పంచుకున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేము పనిచేసాము మాకు కూడా డబ్బులు పంచండి అని అధికారులను వేడుకుంటున్నారు. కనకాపురం వన సంరక్షణ సమితి లో 2008 సంవత్సరంలో జామాయిల్ మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. ఈ సమితిలో మొత్తం 186 మంది సభ్యులు ఉన్నారని అన్నారు. అప్పటినుండి మొక్కలను సంరక్షించుకుంటూ అందరితోపాటు మేము కూడా భాగస్వామిలుగా పని చేశామని తెలిపారు. 20 23 సంవత్సరంలో జామాయిల్ కటింగ్ చేయడం జరిగింది. అప్పుడు కూడా మా పేర్లు ఉన్నాయని అన్నారు. వి ఎస్ ఎస్ షేర్ అమౌంట్ 46 లక్షల రూపాయలు రావడం జరిగింది. అయితే మా 20 పేర్లు తీసివేసి వారు డబ్బులు పంచుకున్నారు. గత మూడు రోజులుగా అడగగా మీ కుల పెద్దలకు ఇవ్వడం జరిగింది వారిని అడగండి అని అన్నారు. కుల పెద్దలను అడగగా మీ డబ్బులు మాకు ఇవ్వలేదు అని సమాధానం చెప్పడంతో అయోమయంలో పడ్డారు. అధికారులు, నాయకులతో కలిసి మాకు అన్యాయం చేశారని ఆరోపిస్తున్నారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం రేంజ్ కార్యాలయానికి వెళ్లి అధికారులను అడుగుతామని అన్నారు. సోమవారం ఏలూరు పిజిఆర్ఎస్ లో కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మక్కిళ్ళ రాంబాబు, వెంకటేశ్వరి, కొండయ్య, శివ పార్వతి, లక్ష్మి, దేవర్ల వెంకటేశ్వరరావు, లక్ష్మి, సాయి, కృష్ణ, పెదబాబు, తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం కాలవలో ఒక వ్యక్తి మృతదేహం లభ్యం.



**గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 08:**–గోకవరం మండలం వెదురుపాక గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మృతదేహం కోరుకొండ మండలం కనుపూరు గాడాల సమీపంలో ఉన్న పోలవరం కాలువలో గురువారం ఉదయం లభించింది. మృతుడిని గోకవరం మండలం వెదురుపాక పంచాయతీకి చెందిన బొట్టా మధుబాబుగా గుర్తించారు.ఇతనికి సంబంధించి గోకవరం పోలీస్ స్టేషన్ లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు తెలుస్తోంది. కోరుకొండ మండలం గాదరాడ, కనుమూరు గ్రామాల మధ్య కాలువలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న గోకవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల కారణాలు పోస్టుమార్టం అనంతరం తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.



## పెద్దేవం గ్రామ చెరువుల్లో గంబూసియా చేప పిల్లలు విడుదల



**దోమల నివారణకు ప్రత్యేక చర్యలు**

**తాళ్ళపూడి, పెన్ పవర్, అక్టోబర్ 8:**గురువారం దోమల నివారణే ధ్యేయంగా మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పెద్దేవం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.అన్నపూర్ణ పర్యవేక్షణలో గ్రామంలోని రెండు ప్రధాన చెరువుల్లో సుమారు 6,000 గంబూసియా చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. చెరువుల్లో దోమలు పెట్టే గుడ్లు, లార్వాలను ఈ గంబూసియా చేపలు ఆహారంగా తీసుకుంటాయని, దీనివల్ల దోమల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. ఫలితంగా దోమకాటు వల్ల వ్యాపించే మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోదకాలు వంటి ప్రమాదకర వ్యాధులను అరికట్టవచ్చని వివరించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, కేవలం అధికారుల చర్యల వల్లే కాకుండా, ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నిర్మూలన సాధ్యమవుతుందని డాక్టర్ అన్నపూర్ణ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేయకుండా పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దేవం పంచాయతీ కార్యదర్శి కె.కామేశ్వరి, ఎంపీహెచ్ఈఓ ఎస్.రమేష్, హెల్త్ అసిస్టెంట్‌లు ఎస్.వి.వి.సత్యనారాయణ, ఎమ్.రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వంతో వివాదాలకు సామరస్య పరిష్కారం





**జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్ , అక్టోబర్ 8:** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మధ్యవర్తిత్వ శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం రెండో రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యూ మల్టీ కోర్ట్స్ బిల్డింగ్ కాంప్లెక్స్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన శిక్షణ పొందిన మధ్యవర్తులకు 'మధ్యవర్తిత్వంపై అవగాహన-- ఓరియంటేషన్ సెషన్' నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా మాట్లాడుతూ, మధ్యవర్తిత్వ విధానం వివాదాలను సుదీర్ఘ న్యాయ ప్రక్రియకు వెళ్లకుండా త్వరితగతిన పరిష్కరించు కునే అవకాశం ఉంటుందని తెలిపారు. సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. మధ్యవర్తిత్వంలోని మెళకువలు, నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారా కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన శిక్షణ పొందిన మధ్యవర్తులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు తమిళనాడుకు చెందిన సీనియర్ శిక్షకులు సుదర్శన సుందర్, 9వ అదనపు జిల్లా జడ్జి షణ్ముఖ రావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యార్లగడ్డ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అడ్డతీగలలో "డ్రగ్స్ వద్దు బ్రో" కార్యక్రమం.. భారీ ర్యాలీ.. మానవహారం..





**అడ్డతీగల, పెన్ పవర్, అక్టోబర్ 08:** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనే సందేశంతో అడ్డతీగల ప్రభుత్వ సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల లో డ్రగ్స్ వద్దు బ్రో అనే అంశంపై విద్యార్థులకు చైతన్య కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులు అడ్డతీగల వీధుల్లో ర్యాలీ నిర్వహించి, స్థానిక దేవి సెంటర్ లో మానవహారం నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా గంజాయిని వీడండి--ఆరోగ్యాన్ని కాపాడుకోండి, సారాను తాగకండి--కుటుంబాలను కాపాడుకోండి అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. గంజాయి, సారా, కొకైన్ వంటి మత్తు పదార్థాలు, మద్యం వినియోగం వల్ల ఆరోగ్యంతో పాటు కుటుంబాలు ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడుతున్నాయని వివరించారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కాకుండా విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మఠం. ఆనందబాబు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు, మద్యపానానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని, మద్యం మత్తు కుటుంబాల్లో అనేక సమస్యలకు కారణమవుతోందని పేర్కొన్నారు. మత్తు పదార్థమైనా, పానీయమైనా విషమే అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ప్రధానోపాధ్యాయులు ఆనంద్ బాబు విద్యార్థులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమ ప్రత్యేక కోఆర్డినేటర్, బయాలజీ ఉపాధ్యాయులు ఎల్. పాండురంగస్వామి మాట్లాడుతూ ఖైనీ, గుట్కా, సిగరెట్, పాన్ మసాలా తదితర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు నిర్వహించిన ఈ చైతన్య ర్యాలీ ద్వారా ప్రజల్లో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు.

## అడ్డతీగల శాఖా గ్రంథాలయాన్ని సందర్శించిన గ్రంథాలయ చైర్మన్ భూపతిరాజు. ఈశ్వరరాజు వర్మ...




**అడ్డతీగల, పెన్ పవర్, అక్టోబర్ 8:** అడ్డతీగల శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భూపతిరాజు. ఈశ్వరరాజు వర్మ , సంస్థ కార్యదర్శి కే. జే. ఎస్. ఎల్ కుమారి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పాఠకులతో, సిబ్బందితో మాట్లాడి ప్రస్తుతం అందుతున్న సౌకర్యాలు, పాఠకుల అవసరాలు, గ్రంథాలయ నిర్వహణకు సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు.గ్రంథాలయంలో పాఠకులకు మరింత మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చైర్మన్ భూపతిరాజు. ఈశ్వరరాజు వర్మ తెలిపారు. అదనపు సౌకర్యాలు లేదా అభివృద్ధి పనులు అవసరమైతే తమ దృష్టికి తీసుకురావాలని, గ్రంథాలయ అభివృద్ధికి ఉపయోగపడే సూచనలు అందించాలని ఆయన కోరారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు, పాఠకులకు ఉపయోగపడే విధంగా గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడ్డతీగల శాఖా గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ కుంజం. ప్రియదర్శిని, రాజోలు మండల టీడీపీ అధ్యక్షులు అనుచూరి .సునీత రామపురుషోత్తం, అంబేడ్కర్ కోనసీమ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు లంకే. శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు చింత. వీరభద్రరావు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ బూతులు పరిశీలన




**జీలుగుమిల్లి, పెన్ పవర్, అక్టోబర్ 8;** స్థానిక సంస్థలు ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూతు లలో మౌలిక సదుపాయాలు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించడం జరిగిందని ఎంపీడీవో కే వెంకటలక్ష్మి తెలిపారు. గురువారం పి రాజవరం గ్రామంలో పోలింగ్ బూత్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్రాగునీరు, విద్యుత్తు, మరుగుదొడ్లు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వి క్రాంతి కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com